రీ సర్వేలో జాగ్రత్త వహించాలి: జేసీ

సీతంపేట రూరల్/వీరఘట్టం, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో జాగ్రత్త వహించాలని, ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ శోభిక ఆదేశించారు. సోమవారం సీతంపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. రికార్డులు భద్రపరిచే విష యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పి.అప్పలరాజును ఆదేశించారు. అనంతరం వీరఘట్టం మండలం తూడిలో రీసర్వేను పరిశీలించారు. రోజుకు 50 ఎకరాల చొప్పున రీసర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పరిశీలనలో సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



వలగజ్జ గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతున్న ఆదివాసీలు

నత్తనడకన!

- గిరిజన గ్రామాల్లో అంతంతమాత్రంగానే గృహ నిర్మాణాలు
- లబ్ధిదారుల్లో అనేక సందేహాలు
- పనుల్లో కానరాని ప్రగతి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో ఆదివాసీల గృహ నిర్మాణాలకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. వివిధ కారణాలతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాస్తవంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో పీఎం జన్‌మన్ పథకం కింద గిరిశిఖర గ్రామాల్లో (పీవీటీజీ)గిరిజనులకు గృహాలు మంజూర య్యాయి. అయితే అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో గత ఆరు నెలలుగా ఆయా పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోయింది. ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిలో కదలిక వచ్చింది. ఉన్నట్టుండి గడిచిన రెండు నెలలుగా గిరిజన లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఆదివాసీ లబ్ధిదారులు మళ్లీ గృహ నిర్మాణాల్లో నిమగ్నమయ్యారు.

పలు కారణాలతో వెనకడుగు..

పీవీటీజీ ఆదివాసీలకు మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు హౌసింగ్ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.. పురోగతి మాత్రం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పులు చేసి మరీ లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టారు. వీటికి సంబంధించిన బిల్లులు ఇప్పటికీ చెల్లింపులు కాకపోవ డంతో గిరిజనుల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా రెవెన్యు శాఖ నుంచి ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు కూడా సకాలంలో రావడం లేదు. దీంతో గృహ నిర్మాణాలకు గిరిజనులు వెనకడుగు వేస్తున్నారు. వారిలో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడంలో హౌసింగ్, సచివాలయ సిబ్బంది విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తంగా సీతంపేట మన్యంలో ఆశించిన స్థాయిలో గృహ నిర్మాణాలు జరగడం లేదు.

ఇదీ పరిస్థితి..

ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర సర్కారు పీఎం జన్‌మన్, పీఎం జూగ వంటి పథకాలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగా సీతంపేట మన్యంలో 2023-24లో లబ్ధిదారుల ఎంపికపై సంబంధిత హౌసింగ్, సచివాలయ సిబ్బంది అప్పట్లో సర్వే చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా పురిపాక, రేకులషెడ్డులో ఉంటున్న 2,023 మంది పీవీటీజీ లబ్ధిదారులను గుర్తించారు. వీరికి శాశ్వత గృహ నిర్మాణాల మంజూరు కోసం కేంద్ర ప్రభుత్వానికి అప్పట్లో ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు 2024 జనవరిలో కేంద్ర ప్రభుత్వం గృహాలను మంజూరు చేసింది.

వివిధ దశల్లో ..

పీఎం జన్‌మన్ పథకం ద్వారా 2,023 గృహాలు మంజూరు కాగా వాటిలో 302 ఇళ్లు పునాది దశలో , 80 రూఫ్ లెవెల్‌లో ఉన్నాయి. 20 గృహాల శ్లాబులు పూర్తికాగా మరో 6 ఇళ్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. అయితే వీటికి సంబంధించిన బిల్లులు కూడా సకాలంలోనే లబ్ధిదారులకు చెల్లించినట్లు హౌసింగ్ ఏఈ వెంకటేష్ తెలిపారు.

బిల్లుల చెల్లింపులు ఇలా..

మండలంలో 2023 గృహాలకు గాను 1400 ఇళ్లకు రూ.70 వేల చొప్పున బిల్లు మంజూరు కోసం గతేడాదిలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే 58 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు మాత్రమే బిల్లులు జమయ్యాయి. దీంతో మిగతా వారు ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా పీవీటీజీ గ్రామాల్లో ఆదివాసీలు గృహ నిర్మాణం ప్రారంభించి పునాది లెవెల్‌కు చేరేసరికి మొదటి విడతగా బ్యాంకు ఖాతాలో రూ.70వేలు వేస్తారు. రూఫ్ లెవెల్‌లో రూ.90 వేలు, శ్లాబుకు రూ.40 వేలు, ఉపాధి మస్టర్ కింద రూ.27వేలు,



రెండు ఇళ్ల నిర్మాణాలకే పరిమితమైన రామానగరం గ్రామం

(మిగతా 8వ పేజీలో...)

మళ్లీ వాయిదా

- పాలకొండ చైర్‌పర్సన్ ఎన్నికపై వీడని ఉత్కంఠ
- నేడు మరోసారి కౌన్సిల్ సమావేశం

పాలకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పాలకొండ చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ వీడలేదు. కోరం లేకపోవడంతో ఎన్నిక ప్రక్రియ మళ్లీ వాయిదా పడింది. సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు టీడీపీ కౌన్సిలర్లు ముగ్గురు, వైసీపీ నుంచి జనసేనలోకి చేరిన కౌన్సిలర్ కె.గంగునాయుడు, ఇటీవల టీడీపీలో చేరిన మరో కౌన్సిలర్ ఆకుల మల్లీశ్వరి, ఎక్స్ అఫిషియోగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాత్రమే ఈ సమావేశానికి హాజరయ్యారు. వైసీపీ కౌన్సిలర్లంతా గైర్హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు మల్లీశ్వరి ఎన్నికల అధికారి వద్దకు వెళ్లారు. అయితే కోరం లేకపోవడంతో నామినేషన్ కూడా తీసుకోలేమని ఈ సమావేశాన్ని ఈ నెల 18కు వాయిదా వేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ శోభిక, పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నగరపంచాయతీలో సమావేశం ముగిసే వరకు వైసీపీ కౌన్సిలర్లంతా మాజీ ఎమ్మెల్యే కళావతితో కలిసి ఎమ్మెల్సీ విక్రాంత్ ఇంటిలోనే ఉన్నారు. ఇకపోతే మంగళవారం జరగనున్న చైర్‌పర్సన్ ఎన్నికపై టీడీపీ నుంచి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలు కౌన్సిలర్లతో పాటు పార్టీ క్యాడర్‌తో చర్చించారు. మరోవైపు వైసీపీ కౌన్సిలర్లతో ఎమ్మెల్సీ , మాజీ ఎమ్మెల్యే, శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సమావే శమయ్యారు. కాగా ఈ నెల 3, 4న సమావేశం నిర్వహించినా సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరక ఎన్నిక వాయిదా పడిన సంగతి తెలిసిందే.

భారీ బందోబస్తు...

పాలకొండ చైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో సీఐ ఎం.చంద్రమౌళి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయంలోకి సిబ్బంది, మీడియా, కౌన్సిలర్లను మాత్రమే అనుమతి ఇచ్చారు. కమిషనర్ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నిక ప్రక్రియ కోసం వేచి ఉన్న అధికారులు, కూటమి కౌన్సిలర్లు

నైపుణ్యం మెరుగుకు శిక్షణ దోహదం

- ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : విధుల్లో నైపుణ్యం పెంపొందించుకుని మెరుగైన సేవలందించేందుకు శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా సాయిధ పోలీసులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు ఏటా 15 రోజుల పాటు పునశ్చరణ తరగతులు నిర్వహించి.. ఫిజికల్ ఫిటెనెస్ మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మార్చి 3 వరకు జరిగే ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయుధాల వినియోగం, మానసిక ఒత్తిడిని అధిగమించడం, సర్వీస్ రూల్స్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఆర్ఐలు నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

ఆటోనగర్ అంతేనా?

- ఏళ్లు గడుస్తున్నా కనీస అభివృద్ధికి నోచని వైనం
- కానరాని మౌలిక వసతులు
- ఆ ప్రాంతానికి వెళ్లలేకపోతున్న మోటారు కార్మికులు
- మరోవైపు షాపుల అద్దెలు భరించలేని పరిస్థితి..
- సాలూరులో జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య



సాలూరు ఆటోనగర్ ఇలా..



ఈయన పేరు లోపిండి సింహాచలం. లారీలు, బైక్‌లు, ట్రాక్టర్లు, ఆటోలకు సీట్, బాడీ కవర్లు కుడుతూ జీవనం సాగిస్తుంటాడు. అయితే ఆయనకు సాలూరు ఆటోనగర్‌లో షాపు మంజూరైనప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఆ ప్రాంతంలో ఎటువంటి మౌలిక వస తులు కల్పించక పోవడంతో గత కొన్నాళ్లుగా పట్టణంలోని ఓ అద్దె షాపులో ఉంటూ బతుకుబండిని లాగిస్తున్నాడు. వేలాది రుపాయలు అద్దెలు చెల్లించలేక పోతున్నామని.. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించాలని ఆయన కోరుతున్నాడు.



ఈయన పేరు ముగడ నరేష్. సాలూరులో లారీ బాడీ బిల్డింగ్ పని చేస్తుంటాడు. ఈ వ్యక్తికి కూడా ఆటో నగర్‌లో షాపు మంజూరైనా .. అక్కడకు వెళ్లలేని పరిస్థితి. ప్రస్తుతం ఓ అద్దెషాపులో ఉంటూ పనులు చేసుకుంటున్నాడు.

సాలూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): .. ఇలా వారిద్దరే కాదు సాలూరు మున్సిపాల్టీలో ఎంతోమంది ఇలానే బాధపడుతున్నారు. ఆటోనగర్‌కు వెళ్లలేక.. పట్టణంలో వేలాది రుపాయలు ఇచ్చి అద్దె షాపుల్లో ఉండలేక నానా అవస్థలు పడుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు దీర్ఘకాలికంగా ఈ సమస్య వేధిస్తున్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంపై వారు పెదవి విరుస్తున్నారు. వాస్తవంగా రాష్ట్రంలో లారీ పరిశ్రమలో విజయవాడ తర్వాత సాలూరు రెండో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 2వేలకు పైగా లారీలు ఉన్నాయి. ప్రత్యక్షంగా రెండు వేల కుటుంబాలు.. పరోక్షంగా మరో ఐదు వేల కుటుంబాలు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. అయితే పట్టణంలో ఇరుకు రోడ్లపై లారీల మరమ్మతులు చేపడుతుండడం, అక్కడే వాటికి సంబంధించిన షాపులు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రోజురోజుకూ ఈ సమస్య జటిలమవుతున్న నేపథ్యంలో అటు మోటారు కార్మికులు.. ఇటు ప్రజలకు ఏ ఇబ్బందీ ఉండకూడదనే ఉద్దేశంతో ఆటోనగర్‌కు రూపకల్పన చేశారు. లారీ మరమ్మతులతో పాటు దానికి సంబంధించిన షాపులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఓ స్థలం కేటాయించాలని అప్పట్లో నేతలు, ప్రజాప్రతినిధులు భావించారు. ఈ మేరకు 2011, జూన్14న పట్టణానికి కూతవేటు దూరంలో సర్వే నెంబర్ 475/10 లో రెండు ఎకరాల 52 సెంట్లను మంజూరు చేశారు. అప్పటి కలెక్టర్ వీరబ్రహ్మయ్య ఆటోనగర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. అయితే ఆ ప్రాంతంలో ప్రహరీ, స్థలం చదును, ఇతరత్రా మౌలిక వసతులు మాత్రం కల్పించలేదు. ఆ తర్వాత ప్రభుత్వాలు మారుతున్నా.. నాయకులు మారుతున్నా.. దాని ఆటోనగర్ పరిస్థితి మాత్రం మారలేదు. దీని అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి.

- ఆటో నగర్‌లో మెకానిక్ షెడ్లు, వర్క్సషాపులు, బాడి బిల్డింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, బ్యాటరీ, కట్టలు పని, టైర్‌వర్క్స్, గ్యాస్ వెల్డింగ్, సీట్ వర్క్స్, గ్లాస్, హెడ్‌వర్క్స్, పెయింటింగ్స్, ఇలా 108 వరకు షాపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అప్పట్లో డ్రా తీసి పలువురికి షాపులు కేటాయించారు. కొంతమంది నిర్మాణాలు కూడా చేపట్టారు. అప్పట్లో రూ.6 లక్షల 50 వేలతో..

(మిగతా 8వ పేజీలో...)

సహకార సంఘాల ద్వారా

మెరుగైన సేవలు: కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాదిని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో పాథమిక సహకార సంఘాలను బలోపేతం చేయాలని, వాటికి గ్రేడింగ్ ఇవ్వాలని సూచించారు. వాటి వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరించాలని తెలిపారు. జిల్లా సహకార అధికారి పి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. ఈ నెలలో పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారులకు శిక్షణ తరగతులు, పరిసరాల పరిశుభ్రత, సభ్యత్వ నమోదు చేపడతా మన్నారు. మార్చి నుంచి డిసెంబరు వరకు పలు కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి దినేష్‌కుమార్‌రెడ్డి, విజయనగరం, శ్రీకాకుళం డీసీసీబీల జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

జీబీఎస్‌పై అప్రమత్తం

గులియన్ బారీ సిండ్రోమ్ (జీబీఎస్)పై వైద్య , పంచాయతీరాజ్ శాఖలు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. జీబీఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వేడినీరు, తాజా ఆహార పదార్థాలు తీసుకునేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపర్చాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గృహ నిర్మాణ పనులు , బలిజిపేట, సాలూరు మండలాల్లో ఎంఎస్ఎంఈ సర్వే జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి అగ్ని గంగమ్మ జాతర

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో ఉన్న నీలావడి గ్రామంలో వచ్చేనెల 10వ తేదీ నుంచి అగ్ని గంగమ్మ జాతర నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతరకు పార్వతీపురంతో పాటు శ్రీకాకుళం జిల్లా నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి రానున్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. ఇదిలా ఉండగా భక్తజనం రద్దీ దృష్ట్యా పార్వతీపురం ఆర్టీసీ ఆధ్వర్యంలో నీలావడికి ప్రత్యేకంగా బస్సులు నడపనున్నారు.



మోడ్రన్ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దుతాం

- ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్



రైల్వే స్టేషన్‌ను సందర్శిస్తున్న జీఎం

బెలగాం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం రైల్వే స్టేషన్‌ను మోడ్రన్‌గా తీర్చి దిద్దుతామని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ తెలిపారు. సోమవారం పార్వతీపురం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. అమృత్ భారత్ ప్రాజెక్టులో ఎంపికైన స్టేషన్‌లో జరు గుతున్న ఆధునికీకరణ పనులు పరిశీలించారు. కొత్తగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రైల్వే ప్రయా ణికుల ఎంట్రన్స్ భవనం పనులపై ఆరా తీశారు. నాలుగో నెంబర్ ప్లాట్ ఫారంపై ఏర్పాటు చేసిన మ్యాప్‌లను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రాజెక్టు అమలు వ్యూహాలపై అధికారులతో చర్చించారు. వెయిటింగ్ హాళ్లు, రైల్వే కార్యాలయాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు తదితర పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరి కొన్ని నెలల్లో పార్వతీపురం స్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని జీఎం చెప్పారు. అనంతరం పశ్చిమ రైల్వే కాలనీ, అక్కడ ఏర్పాటు చేసిన పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రన్నింగ్ రూమ్ సిబ్బంది కృషిని గుర్తించారు. మరోవైపు చుట్టుపక్కల కాలనీ వారు తమ సమస్యలపై రైల్వే జీఎంకు వినతిపత్రం ఇచ్చారు. ఈ పరిశీలనలో డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.



ఘనసర పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

పొలాల్లో సంచారం.. పంటలు ధ్వంసం

- ఘనసరలో గజరాజులు
- భయాందోళనలో ప్రజలు, రైతులు

భామిని, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భామిని మండలం ఘనసరలో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. పొలాల్లో సంచరిస్తూ స్థానికులను హడలెత్తిస్తున్నాయి. సోమవారం ఆ గ్రామంలోని మొక్కజొన్న పంట, నాలుగు మోటార్లను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. గతంలో పగలంతా తోటల్లో ఉంటూ సాయంత్రం వేళల్లోనే గజరాజులు పొలాల్లోకి వచ్చేవి. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా అవి సంచరిస్తుండడంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గజరాజుల సమాచారం తెలుసుకున్న తాలాడ, కీసర, కోసలి గ్రామస్థులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. తక్షణమే వాటిని తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఎండకు తట్టుకోలేక నీటి కోసం బోర్లు ఉన్న సమీపానికి ఏనుగులు చేరుకుంటున్నాయని బీట్ ఆఫీసర్ దాలినాయుడు తెలిపారు. దీనిపై ప్రజలు, రైతులకు అప్రమత్తం చేస్తున్నామన్నారు.

ఇక్కడి నుంచి తరలిస్తే రోడ్డున పడతాం
- యంత్రాల ముందు బైఠాయించిన బాధితులు

8లో

ప్రకృతి సేద్యం.. గిరిజనులకు ఆదర్శం
- వ్యవసాయంలో రాణిస్తున్న రవీంద్ర

6లో

రోడ్డు పక్కనో.. హోటళ్లలోనో మీరు చిరుతిళ్లు తింటున్నారా? టిఫిన్లు చేస్తున్నారా? అక్కడ వంటలకు ఉపయోగించే నూనె ఎలా ఉందో చూశారా? అది ఎప్పటిదో?... ఎన్నిసార్లు వినియోగించారో పరిశీలించారా? అలా మళ్లీ మళ్లీ వినియోగించే వంట నూనెలతో చేసే ఆహార పదార్థాలు ఆరోగ్యానికి హాని చేస్తాయని తెలుసా?...సరిగ్గా ఈ అంశాలపై కేంద్ర ప్రభుత్వం సర్వే చేస్తోంది. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే పనిలో పడింది.

- వంట నూనెల వినియోగంపై కేంద్రం సర్వే
- ఆరోగ్యానికి తీవ్ర ముప్పు

మళ్లీ మళ్లీ వాడుతున్నారా?



బొబ్బిలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలోనే కాకుండా పట్టణ, నగర ప్రాంతాలలో వంట నూనెల వినియోగం విపరీతంగా ఉంది. అంతేకాకుండా వాడేసిన వంట నూనెను మళ్లీ మళ్లీ వినియోగిస్తుండడం సర్వసాధారణంగా మారిపోయింది. వంట నూనెల ప్రభావం జనం ఆరోగ్యంపై చాలా తీవ్రంగా ఉంటోందని ఆరోగ్య నిపుణులు, వైద్యులు హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశంలో వంటనూనెల వినియోగంపై కేంద్రం ఓ ప్రత్యేక సర్వే నిర్వహిస్తోంది. ఈ నెల 23లోగా ప్రజలు వంటనూనెల వినియోగంపై తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో చెప్పుకునే వెసులుబాటు కల్పించింది.

వీధి వ్యాపారులే అధికం

ఇళ్లల్లోనే కాకుండా వీధి వర్తకులు తినుబండారాల తయారీ కోసం వంటనూనెను పునర్వినియోగం చేస్తున్నారు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే అంశాలు ఇలా ఉన్నాయి. 'ఇంట్లో నిత్యం కూర వేపుళ్లకు వాడిన వంట నూనెను మళ్లీ వంటల కోసం వాడుతున్నారా? అలా వాడితే వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన ఉందా?' వంటి 24 ప్రశ్నలను భారత అర్థ గణాంక శాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ ప్రశ్నలన్నింటికీ ప్రజలంతా తమ అభిప్రాయాలను ఈ నెల 23లోగా వెల్లడించవచ్చని స్పష్టం చేసింది. ఈ తరహా సర్వే నిర్వహించడం ఇదే ప్రథమంగా భావిస్తున్నారు.



ముప్పుపై అవగాహనకే...

ఇటీవల కాలంలో ప్రజల ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తే... ఎక్కువ మంది గుండె జబ్బులు, క్యాన్సర్, కీళ్ల నొప్పులు, కిడ్నీ వ్యాధులతో తీవ్రంగా బాధ పడుతున్నారు. వీటన్నిటికీ ప్రధాన కారణం పర్యావరణంలో చోటు చేసుకుంటున్న పెనుమార్పులన్నది జగద్విదితమే. కాలుష్యం దీనికి తోడవుతోంది. రోడ్డు పక్కన తినుబండారాలు తయారు చేసే వారు వంట నూనెలను గంటల తరబడి మరిగించి మరీ వినియోగిస్తున్నట్లుగా అధికార యంత్రాంగం ఎప్పుడో గుర్తించింది. దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఈ తరహా వీధి వ్యాపారాలు సాగుతున్నాయి. వీటికి కాలుష్యం తోడవడం వల్ల కోట్లాది మంది ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరిగించిన వంటనూనెను మళ్లీ మళ్లీ వినియోగిస్తే కలిగే ముప్పు తీవ్రతపై ప్రజలకు ఏపాటి అవగాహన ఉందనేది కేంద్రం సర్వే లక్ష్యం.

సర్వేపై సమాచారం లేదు

వంటనూనెల వినియోగానికి సంబంధించిన సర్వే నిర్వహణపై మాకు ఎటువంటి సమాచారం లేదు. వివరాలు తెలుసుకుంటాం.

- లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్



సర్వే నిర్వహించడం హర్షణీయం

మరిగించిన వంట నూనెలను మళ్లీ వినియోగిస్తున్న అంశంపై కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ సర్వే నిర్వహించడం హర్షణీయం. ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన మంచి హెచ్చరిక లాంటిది. పేద, మధ్య తరగతి కుటుంబాలలో వాడేసిన వంటనూనెలను మళ్లీ వినియోగిస్తుండడం పరిపాటిగా మారింది. ఇటీవల గుండెజబ్బులు బాగా పెరిగిపోయాయి. దీనికి వైద్యులు వంట నూనె వినియోగాన్ని తగ్గించాలని హెచ్చరిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ విపరీతంగా పెరిగిపోవడంతో వంటనూనె వినియోగం తెలియకుండానే ఇంకా పెరిగిపోయింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సర్వేపై ఇంకా పెద్దఎత్తున ప్రచారం జరగాల్సి ఉంది. ఇంటింటికీ ఈ సర్వే సమాచారాన్ని చేరవేయాలి.

- ఎస్వీ రమణమూర్తి, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు, బొబ్బిలి



ప్రకృతి సేద్యం.. గిరిజనులకు ఆదర్శం

- వ్యవసాయంలో రాణిస్తున్న రవీంద్ర
- స్వచ్ఛమైన కూరగాయల పెంపకం
- గిరిజన గ్రామాల్లో మాత్రమే విక్రయం

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యావంతుడైన ఆ గిరిజన యువకుడు ఉద్యోగాల కోసం చూడకుండా... తండ్రి బాటలో వ్యవసాయం వైపు అడుగులు వేశాడు. ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తూ.. లాభాలు చవి చూస్తున్నాడు. ఆయనే దుగ్గి గ్రామానికి చెందిన ఆరిక రవీంద్ర. సీతంపేట ఏజెన్సీలోని మారుమూల గ్రామమైన దుగ్గిలో ఉంటూ.. చిన్నతనం నుంచి తండ్రి ఆరిక పాపయ్యకు వ్యవసాయ పనుల్లో సాయం చేసేవాడు రవీంద్ర. ప్రస్తుతం తనకు ఉన్న నాలుగెకరాల భూమిలో 10 రకాల కాయగూరలతో పాటు వరి, మొక్క జొన్న, రాగులు, కొర్రలు, గంటెలు, మిరప, సామలు, ఉలవలు వంటివి పండిస్తున్నాడు. దుగ్గి పంచాయతీతో పాటు నాయకమ్మగూడ, పొల్ల, టిటుకుపాయి పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో ఈ పంటలను విక్రయిస్తుంటాడు. మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్న తరుణంలో కారుచౌకగా ఎటువంటి రసాయనాలు లేని కూరగాయలను గిరిజనులకు అందిస్తున్నాడు. తాను పండించే పంటలను బయట మార్కెట్‌లో విక్రయించనని... కేవలం గిరిజన గ్రామాల్లో మాత్రమే విక్రయిస్తానని రవీంద్ర చెబుతున్నాడు. పెట్టుబడులు పెద్ద మొత్తంలో లేనందున తక్కువ ధరకు విక్రయించగలుగుతున్నానని వివరిస్తున్నాడు.



తాను పండించిన వంకాయలను చూపుతూ...

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

నేటి మార్కెట్‌లో అన్ని రకాల పంటలు, కూరగాయలు రసాయన ఎరువులతో పండించినవేనని, వీటి వినియోగం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆరిక రవీంద్ర గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాడు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాడు. మరికొందరు రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టేలా ప్రోత్సహిస్తున్నాడు. తనతో పాటు దుగ్గి గ్రామస్తులు కూడా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని చెబుతున్నాడు. ప్రకృతి వ్యవసాయం వల్ల తనకు ఏటా దాదాపు రూ.3లక్షల వరకు ఆదాయం వస్తోందని అంటున్నాడు.

ప్రశంసలు

సెంట్రల్ ఫర్ పీపుల్ ఫారెస్ట్(సీపీఎఫ్) సంస్థ తొలుత తనకు విత్తనాలు, రూ.30 వేల విలువైన పరికరాలను అందించిందని తెలిపాడు. వర్షాధారంతోనే పంటలు సాగుచేస్తున్నట్టు రవీంద్ర వెల్లడించాడు. ప్రకృతి వ్యవసాయ విభాగం దక్షిణ జోన్‌లో తనకు జైవిక్ అవార్డును అందజేసిందని వివరించాడు. ఇటీవల డిల్లీలో ఈ పురస్కారాన్ని అందుకున్నట్టు తెలిపాడు. తన ప్రతిభకు గుర్తింపుగా ఇటీవల రిపబ్లిక్ వేడుకల్లో మన్యం జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నాడు.



దుక్కి దున్నుతున్న రవీంద్ర



కూరగాయలను విక్రయిస్తూ..



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

సంతకవిటి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తాలాడ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్థానికంగా శ్రీ ఉమా రామలింగేశ్వర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రాతఃస్మరణం, మండల మండప ఆరాధనలు, క్షీరాధివాసం, జయాధిహోమం, పూర్ణాహుతి, స్వామి వారి లింగ ప్రతిష్ఠ చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. లింగ, వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం

సై సై జోడెడ్లాబండి..

వేపాడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బానాది శివారు ఎం.సంగవరం గ్రామంలో సోమవారం అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల బండ్ల పరుగు పోటీలు ఎంతగానో అలరించాయి. ఈ పోటీలలో సుమారు 12 ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గొంప తులసి సహకారంతో అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో బానాది, బల్లంకి, ఎం.సింగవరం తదితర గ్రామాల ప్రజలు భక్తులు పాల్గొన్నారు.



పరుగు తీస్తున్న ఎడ్లబండి

మార్పులను అందిపుచ్చుకోవాలి

- జేఎన్‌టీయూ వీసీ రాజ్యలక్ష్మి
- ప్రారంభమైన 'ఏక్తారా ఎక్స్‌ఎక్స్‌వీ'

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా విద్యా రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని జేఎన్‌టీయూ ఉపకులపతి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి విద్యార్థులకు సూచించారు. విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వ విద్యాలయం (జేఎన్‌టీయూ)లో 'ఏక్తారా ఎక్స్‌ఎక్స్‌వీ' పేరుతో జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి అనేక మంది అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సదస్సును ప్రారంభించిన ఉపకులపతి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని రంగాల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేశారు. అదే విధంగా ఈఈఈ విభాగంలో కూడా మార్పులు వచ్చాయన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి రోజువారీ జీవితంలో విజయానికి అత్యంత అవసరమైనదని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త పి.త్రిమూర్తులు మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు ప్రాథమిక సూత్రాలపై దృష్టి సారించడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వర రావు, ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజే నాగరాజు, ఈఈఈ విభాగం హెచ్‌ఓడీ డాక్టరు వీఎస్ వకుళ, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు పి.శ్రీనివాసులరెడ్డి, టి శిరీషలు పాల్గొన్నారు.



ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త త్రిమూర్తులను సత్కరిస్తున్న వీసీ, అధ్యాపకులు

పకడ్బందీగా లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలు

- స్కానింగ్ సమాచారం పక్కాగా ఉండాలి
- జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తిలో వ్యత్యాసం అధికంగా ఉంటోందని, దీనిని తగ్గించేందుకు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టం జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం తన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలపై గట్టి నిఘా ఉంచాలని అన్నారు. జిల్లాలో ఉన్న 110 స్కానింగ్ కేంద్రాల్లో రోజువారీ స్కానింగ్ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులకు అవసరం ఉన్నా లేకపోయినా సిజేరియన్‌లకు డాక్టర్లు సిఫారసు చేస్తున్నట్టు తెలుస్తోందని అన్నారు. దీంతో పేద కుటుంబాలపై అనవసరంగా ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

నెల నెలా సమాచారం

జిల్లాలో సాధారణ, శస్త్ర చికిత్స ద్వారా జరిగే ప్రసవాలు, ఏనెలకానెల జరిగే అబార్షన్లకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శస్త్ర చికిత్సలు ఎన్ని జరుగుతున్నాయి? ఏయే ప్రాంతాల్లో జరుగుతున్నాయనే సమాచారం అందజేయాలని, దీని ఆధారంగా విశ్లేషించాలని సూచించారు. అబార్షన్‌లపై కూడా పూర్తి సమాచారం ఉండాలన్నారు. అవి చట్టబద్ధంగా జరుగుతున్నాయా? లేదా అక్రమంగా జరుగుతున్నాయా? అనే సమాచారం సేకరించాలని ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాల తనిఖీ విషయంలో పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డీవోలు కూడా స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 115 స్కానింగ్ కేంద్రాలకు గాను ఇప్పటి వరకూ 47 కేంద్రాల తనిఖీ పూర్తయినట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు. మొక్కుబడిగా స్కానింగ్ కేంద్రాల తనిఖీ చేయడం వల్ల ప్రయోజనం ఉండదని, ఫలితాలు కన్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి జీవనరాణి, టీబీ నియంత్రణ అధికారి రాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

● బీసీ వసతి గృహాల్లో శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం ● ప్రణాళికలు సిద్ధం చేసిన బీసీ సంక్షేమాధికారి



స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి యశోదనరావు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీసీ వసతి గృహాల్లో పదోతరగతి విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా సంబంధిత శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థులను ఎలా తర్ఫీదు ఇవ్వాలనే దానిపై ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. వసతిగృహాల్లో వెనుకబడిన విద్యార్థులకు ట్యూటర్స్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 15 వసతి గృహాల్లో 328 విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. మంచి మార్కులు ఎలా సాధించాలన్న దానిపై జిల్లా ఇన్‌ఛార్జి బీసీ సంక్షేమాధికారి పెంటోజీరావు.. సహాయ సంక్షేమాధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు ఇష్టంతో చదివేలా వారిలో మార్పు తీసుకుని రావాలని సూచించారు రాత్రి సమయంలో సంక్షేమాధికారులు వసతిగృహాలను సందర్శించాలని ఆదేశించారు.

ఉత్తమ ఫలితాల సాధన కోసమే..

జిల్లాలోని వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. ప్రతి వసతి గృహంలోనూ శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళిక తయారుచేశాం. ప్రతి సబ్జెక్టులోనూ అత్యధిక మార్కులు వచ్చేలా కార్యచరణ రూపొందించాం. అలాగే జిల్లాలోని 21 వసతి గృహాల మరమ్మతులకు రూ.60 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నెలఖరు నాటికి పనులు పూర్తిచేసేలా చర్యలు చేపడతాం.

-పెంటోజీరావు, జిల్లా ఇన్‌ఛార్జి బీసీ సంక్షేమాధికారి

గ్రామ సచివాలయంలో మద్యం తాగుతూ..

సంతకవిటి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామ సచివాలయంలో మద్యం సేవిస్తూ ఓ అధికారి గ్రామస్థులు దొరికి పోయారు. మండలంలో ఉపాధిహామీ పనులపై ఆడిట్ సాగుతోంది. దీనికి సంబంధించిన ఓ అధికారి సోమవారం ఆడిట్ పూర్తయ్యాక సోమవారం రాత్రి సచివాలయంలో బస చేశారు. అయితే లోపల ఆ అధికారి మద్యం సేవిస్తూ తమ కంట పడ్డాడని గ్రామస్థులు చెబుతున్నారు. తర్వాత వారంతా సదరు అధికారిని నిలదీశారు. గ్రామస్థులు లోపలకు వస్తుండడం చూసిన ఆ అధికారి మద్యం బాటిల్, బిర్యానీ ప్యాకెట్ కిటికీ నుంచి బయటకు విసిరేశారు. వీటన్నింటీ కొందరు వీడియో తీశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం, రింగురోడ్డు ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని 132 కేవీ ఒంటితోట సబ్ స్టేషన్, 33 కేవీ బుచ్చన్న కోనేరు ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల్నా నేపథ్యంలో మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు త్రినాథరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని తోటపాలెం, శ్రీరామ్‌నగర్, గోపాల్‌నగర్, ఇందిరానగర్, నాగోజీపేట, రైల్వేస్టేషన్, బాలాజీనగర్, సాయినగర్, నర్సింహనగర్, సిద్ధార్థనగర్, ధర్మపురి, దాసన్నపేట ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

రేపటి నుంచి గాయత్రీమాత జాతర

రాజాం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులోని కొలువైన గాయత్రి వేదమాతకు ఈనెల 19 నుంచి 21 వరకు జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, వివేకానందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని విశ్వేశ్వర, సూర్యనారాయణ, కాశీ విశ్వేశ్వర, సత్యనారాయణస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు

మెరకముడిదాం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మెరకముడిదాంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిలకు సోమవారం బాలమిత్ర ఫౌండేషన్ శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా విద్యాలయం ప్రత్యేకాధికారి గౌస్యబేగం మాట్లాడుతూ ఇప్పటికే బాలమిత్ర ఫౌండేషన్ ఎన్నో రకాలుగా విద్యాలయానికి సహాయ సహకారాలు అందిస్తుండటంపై ధన్యవాదాలు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు నూతన డైరీని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌వీ ప్రసాద్ జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి కొండపల్లి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండబాబు, పాత్రికేయులు రాధాకృష్ణ, కె.జె. శర్మ, సముద్రాల నాగరాజు పాల్గొన్నారు.

మహిళలకు ధ్రువపత్రాలు

కొత్తవలస, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శారదా కర్మాగారానికి చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో శిక్షణ పొందిన 54 మంది మహిళలకు సోమవారం యాజమాన్య ప్రతినిధులు సన్యాశిరావు, శంకరరావు, సంతోష్‌కుమార్ సర్టిఫికెట్‌లను అందజేశారు. కుట్టు శిక్షణలో 30 మందికి, బ్యూటీషియన్ కోర్సులో ఆరుగురు, కంప్యూటర్ స్కిల్స్‌లో 18 మంది శిక్షణ పొందారు

విలీనం చేయవద్దు

రేగిడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో అమదాలవలస కాలనీ పాఠశాలను ఫౌండేషన్ స్కూల్ పేరిట పంచాయతీ హెడ్‌క్వార్టర్ స్కూల్‌లో విలీనం చేసే యోచన తక్షణమే విరమించుకోవాలని ఆమదాలవలస గ్రామస్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు.

యాప్‌ను రద్దు చేయాలి

సాలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ వర్కర్లకు ఎఫ్ఆర్ఎస్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఏపీ శ్రామిక మహిళా ఉమ్మడి జిల్లా కన్వీనర్ బలగ రాధ డిమాండ్ చేశారు. పట్టణంలో ఏరియా ఆసుపత్రి వద్ద సోమవారం ఆమె వర్కర్లతో కలిసి నిరసన చేపట్టారు.

టీడీపీని మరింత పటిష్ఠం చేయండి



టీడీపీలో చేరిన వారితో ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 17: జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత పటిష్ఠం చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజయనగరం మండల పరిధిలోని గుంకలాం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి, టీడీపీలో చేరిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి ఎంపీ అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. మంచి వారు ఎవరున్నా పార్టీలోకి ఆహ్వానించి, పార్టీని మరింత పటిష్ఠం చేయాలన్నారు. టీడీపీలో తాను సాధారణ కార్యకర్తగా సేవలు అందించానని, సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఎంపీ వరకూ ఎదిగానన్నారు. టీడీపీలో కార్యకర్తకు ఏ స్థాయిలో గుర్తింపు వస్తుందో తానే ఓ ఉదాహరణ అన్నారు. అనంతరం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు పట్ల ఆకర్షితులై వచ్చేవారిని పార్టీలోకి తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విజయనగరం మండలం గుంకలాం నుంచి ఎంపీటీసీ బలగం రమణ, బలగం సత్తిబాబు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు గెడ్డపాము సుందరరావు, కులుకు శ్రీను, బలగం పెంటనాయుడు తదితరులను మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడులను పార్టీ నాయకులకు పరిచయం చేశారు. అనంతరం వీరందరికీ ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, వేచలపు శ్రీనివాస్, అనురాధ బేగం, తెలుగుయువత నాయకుడు గంటా రవి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న పలువురి వైద్య ఖర్చులకు సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అందజేశారు. ఎస్.కోట, కొత్తవలస, ఎల్.కోట మండలాలకు చెందిన ఐదుగురికి రూ.7.31 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది పేదల ప్రభుత్వమన్నారు. పేదలను ఆదుకోవడంలో చంద్రబాబును మించిన నేత మరొకరు లేరన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క పేదవాడికి సీఎం రిలీఫ్ ఫండ్ అందించిన దాఖలాలు లేవని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్.కోట, ఎల్.కోట మండల పార్టీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, చొక్కాకుల మల్లునాయుడు, రెడ్డి వెంకన్న పాల్గొన్నారు.


సందడిగా అ'పూర్వ' కలయిక



గర్భాం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

గరివిడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గర్భాం హైస్కూల్ వేదికగా సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సోమవారం నిర్వహించారు. దాదాపు 38 ఏళ్ల తరువాత తాము చదివిన పాఠశాలలో 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలిశారు. ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకుని అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

వైద్య శిబిరంలో 287 మందికి సేవలు



శిబిరానికి హాజరైన వైద్యులు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం, విశాఖ నారాయణ మెడిసిటీ సంయుక్తంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వాసవీ కన్యకపరమేశ్వరీ ఆలయంలో నిర్వహించిన శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ చేశారు. నేత్ర, గుండె, చర్మ వ్యాధిగ్రస్థులకు సేవలు అందించారు. శిబిరంలో వైద్యులు శరత్‌చంద్ర, హరిత, సందీప్, సుధానంద, సాయిలహరి, శ్రీదేవి సేవలు అందించారు. శిబిరంలో 287 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు కాపుగంటి నారాయణరావు, కాపుగంటి త్రినాథ్, సత్యారావు, రమణయ్యశెట్టి, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెండు గోదాములకు ఒకరే ఇన్‌చార్జి

రాజాం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజాం, రేగిడిని సివిల్ సప్లయిస్ గోదాముల ఇన్‌చార్జిగా రేగిడి డీటీ డి.శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. దీంతో రేషన్ డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. సరుకులు విడుదలలో తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈవిషయంపై సివిల్ సప్లయిస్ డీఎం మీనాకుమారి వద్ద ప్రస్తావించగా మంగళవారానికి ఇన్‌చార్జిని నియమిస్తామన్నారు.

భూ స్థితి ఆధారంగా నష్టపరిహారం



మాట్లాడుతున్న ఆర్డీవో కీర్తి

వేపాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భూముల పరిస్థితిని బట్టి రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామని ఆర్డీవో దాట్ల కీర్తి అన్నారు. సోమవారం మండలంలోని బొద్దాం, పాటూరు సచివాలయాల్లో పెందుర్తి-బొడ్డవర రోడ్డు విస్తరణకు సంబంధించిన రైతులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు రూ.10 లక్షలు భూసేకరణ ధర ఉండగా, దానికి రెండున్నర రెట్లు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే రోడ్డు విస్తరణలో కోల్పోయిన ఇళ్లు, మెట్టు పల్లం భూములు, చెట్లు, బోరు బావులకు కూడా నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. ప్రభుత్వ భూమికి పరిహారం చెల్లించడం జరగదన్నారు. డి పట్టా ఉంటే మాత్రం పరిహారం చెల్లిస్తామన్నారు. గుడులు తొలిగించాల్సి వస్తే ఆ నష్ట పరిహారం పంచాయతీలకు చెందుతుందన్నారు. పెందుర్తి నుంచి బొడ్డవర వరకూ వేసే నాలుగు రోడ్లులేన్ల రోడ్డు ఇప్పటివరకు స్టేట్ హైవేగా ఉండగా ఇకపై దానిని జాతీయ రహదారిగా రూపాంతరం చెందుతుందన్నారు. లబ్ధిదారులు పేర్లు జాబితాలో నమోదు కాకుంటే రీసర్వే జరిపి తుదిజాబితా తయారు చేసి అందరికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రాములమ్మ, డిప్యూటీ తహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ గంగాధర్, భూ సేకరణ డిప్యూటీ తహసీల్దార్ హరికిరణ్, గ్రామ పెద్దలు కొట్యాడ రమణమూర్తి, ద్వారపూడి గంగునాయుడు, సన్యాసిరావు, జనపరెడ్డి ఈశ్వరరావు ఉన్నారు.

సెంచూరియన్‌తో ఎంఆర్ కళాశాల ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయం, విజయనగరం మహారాజా కళాశాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సోమవారం ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి మధ్య ఈ ఒప్పందం జరిగింది. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం విద్యా ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన, విజ్ఞాన మార్పిడి, నైపుణ్యం మార్పిడి వంటి అవకాశాలకు ఈ ఒప్పందం దోహదపడనుంది. కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నిడియోల్, డీన్ డాక్టర్ విజయ్ బాబు, ఐక్యూ ఏసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ ప్రొఫెసర్ అనిల్ కుమార్, డీన్ డాక్టర్ పుష్పలత, డాక్టర్ పి.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి



సమస్యలు చెబుతున్న గెస్ట్ లెక్చరర్లు

లక్కవరపుకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిలారి అప్పలరాజు గెస్ట్ లెక్చరర్ల సమస్యలపై ఆయనకు వివరించారు. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ జీతాల్లో చాలా వ్యత్యాసం ఉందన్నారు. గంటల లెక్కన కాకుండా 12 నెలల కాన్సాలిడేటెడ్ జీతం ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో చంద్రబాబు ఎస్.కోట వచ్చిన సమయంలో వినతిపత్రం అందజేస్తే సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. దీనిపై పల్లా సానుకూలంగా స్పందించారని యూనియన్ నాయకులు తెలిపారు.

18 నుంచి ఆధార్ శిబిరం



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిముడిదాంలోని సచివాలయంలో ఈనెల 18 నుంచి 21 వరకు ఆధార్ శిబిరం ఏర్పాటు చేయనున్నామని ఎంపీడీవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఆధార్ కార్డు లేని 0 నుంచి 6 ఏళ్ల పిల్లలకు కొత్త ఆధార్ కార్డుల నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

●సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై ప్రజలకు సేవలు అందించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం రాజీయ్యపేట సచివాలయాన్ని ఆయన సందర్శించారు. సర్వేను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వంటింటి వ్యర్థాలతో ఎరువుల తయారీ

రాజాం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వంటింటి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా తయారు చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండలంలోని కంచరాం సచివాలయంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వంటింటి, వ్యవసాయ వ్యర్థాలను ఆరుబయట పారబోయకుండా సేంద్రియ ఎరువు ఎలా తయారు చేసుకోవాలో వివరించారు.

వైరస్‌ల నిర్మూలనకు చర్యలు

గజపతినగరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): టీబీతో పాటు పలు రకాల వైరస్‌ల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టీబీ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ నీరద వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు. సోమవారం మండలంలోని మరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వైరస్ నిర్మూలనకు అవసరమైన మందులు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని టీబీ, లెప్రసీ కేసులతో పాటు ఇతర వ్యాధులకు సంబంధించిన రోగుల వివరాలపై ఆరా తీశారు. ఆమెతో పాటు లెప్రసీ డీఎల్‌ఏటీవో రాణి, పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయికృష్ణారెడ్డి, అనూజ్‌రాయ్ తదితరులున్నారు.



సూచనలు చేస్తున్న టీబీ అడిషనల్ డైరెక్టర్ నీరద

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

●మరో వ్యక్తికి తీవ్రగాయాలు

క్రైం న్యూస్



దుర్గాప్రసాద్(ఫైల్)

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పుణ్యగిరి సమీపంలో అరుకు-విశాఖ ప్రధాన రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాడితబోయిన దుర్గాప్రసాద్ (17) మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటనపై స్థానికులు అందించిన వివరాలకు మేరకు.. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బాడితబోయిన దుర్గాప్రసాద్ తన ఇంటి కోసం కరెంట్ సామన్లు తీసుకువచ్చేందుకు ద్విచక్ర వాహనంపై మధ్యాహ్నం ఎస్.కోట బయలు దేరాడు. పుణ్యగిరి కళాశాల దగ్గరకు వచ్చేసరికి రోడ్డు అవతల వైపునకు వెళ్లేం దుకు రెడ్డి అనే వ్యక్తి తన వాహనంతో సిద్ధం గా ఉన్నాడు. అయితే బైక్‌పై వస్తున్న దుర్గాప్రసాద్ నియంత్రణ కోల్పోయి ఎదుట ఉన్న ద్విచక్ర వాహ నాన్ని ఢీ కొట్టాడు. రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన లో రెడ్డి కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి.

తల్లికి తీరని శోకం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలుడు దుర్గాప్రసాద్‌కు తల్లి గంగ, సోదరి యశోద ఉన్నారు. తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో తల్లి.. పిలలను తీసుకుని కన్నవారి ఊరు కొత్తూరులో ఉంటోంది. కష్టపడి పిల్లలను చదివిస్తోంది. దుర్గాప్రసాద్ స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకెండియర్, యశోద ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్ద ఉంటోంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు చనిపోయాడన్న విషయాన్ని ఆ తల్లి జీర్ణించుకోలేకపోతోంది. కన్నీరుమున్నీరై విలపించింది.

బాలికను బైక్‌తో ఢీకొన్న బాలుడు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనాపల్లిలో ఓ ఫంక్షన్ హాల్ వద్ద తన తండ్రితో రోడ్డుపై నిల్చున్న ఎనిమిదేళ్ల బాలికను ఓ బాలుడు బైక్ వచ్చి బలంగా ఢీకొన్నాడు. దీంతో బాలిక గాయపడింది. ఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. పోతనాపల్లిలోని ఫంక్షన్ హాల్ జరుగుతున్న వివాహానికి మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన బొండపల్లి రక్షిత తన తల్లిదండ్రులతో వచ్చింది. రాత్రి 11.30 గంటల సమయంలో తండ్రితో పాటు ఫంక్షన్ హాల్ బయట వేచి ఉండగా మండలంలోని ధర్మవరానికి చెందిన ఓ బాలుగు ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తు బాలికను ఢీ కొట్టాడు. దీంతో బాలిక తల, కళ్లు, ముక్కుకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యానికి విశాఖ కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. ప్రమాదానికి కారణమైన బాలుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

10 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కొత్తవలస, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేపాడ మండలం కొండ గంగుబూడిలో సోమవారం ఎస్.సోమేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతడి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరు పరిచామన్నారు.. దాడుల్లో ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

●విజయనగరం క్రైం: గజపతినగరం మండలంలోని కెంగువలో సోమవారం బొంతా పైడిరాజును అదుపులోకి తీసుకుని అతడి నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. పైడిరాజుపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీ నాయుడు, జనార్దన్ పాల్గొన్నారన్నారు.

గ్యాస్ లీకేజీతో మంటలు.. ఒకరికి గాయాలు

కొత్తవలస, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటకాపల్లిలో గ్యాస్ సిలెండర్ లీకై అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం జరిగిన ఘటనలో బాడితబోని అప్పలరాజు గాయాలపాలయ్యాడు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామంలో అమ్మవారి తీర్థం సందర్భంగా ఇల్లంతా బంధువులతో కళకళాడుతున్న సమయంలో ఇంటోని స్పేర్ గ్యాస్ సిలెండర్ నుంచి మంటలు వ్యాప్తి చెందాయి. దాంతో అప్పలరాజుకు గాయాలపాలయ్యాడు. కొత్తవలసలో ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖకు తరలించారు. కంటకాపల్లి శారదా కర్మాగారానికి చెందిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.. ప్రమాదంలో సుమారు రూ.లక్ష విలువైన గృహోపకరణాలు కాలిపోయాయి.

కాలువ పనులను అడ్డగించిన రైతులు



అధికారులతో చర్చిస్తున్న గ్రామస్థులు

పూసపాటిరేగ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఎడమ కాలువ పనులను మండలంలో కందివలస రైతులు సోమవారం అడ్డగించారు. కాలువ కోసం చెరువును ఎలా పాడు చేస్తారంటూ రైతులు ప్రశ్నించారు. ఊరచెరువులో జరుగుతున్న పనులను అడ్డగించారు. చెరువు గర్భంలో కాలువ పనులు నిర్వహించటంతో పాటు రక్షణ గోడ నిర్మాణం చేపట్టడం కారణంగా ఆయకట్టుదారులు నష్టపోతారన్నారు. కాలువ నీరు చెరువులోకి పంపే విధంగా అధికారులు లిఖితపూర్వకంగా రాసిస్తే పనులకు అంగీకరిస్తామన్నారు. దీంతో కాలువ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

కలెక్టరేట్ ఎదుట దళితుల ఆందోళన

విజయనగరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దత్తిరాజేరు మండలం కోమిటిపల్లి ఎస్సీ కాలనీలో దళితుల అనుభవంలో ఉన్న భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జాకు యత్నిస్తున్నారని డీఆర్వో శ్రీనివాసమూర్తికి దళితులు వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మానరిటింగ్ జిల్లా కమిటీ మాజీ సభ్యుడు శీర రామారావు ఆధ్వర్యంలో దళితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మాలపల్లిలో సుమారు 20 సెంట్ల స్థలం ఉందన్నారు. అక్కడ అంబేద్కర్ సామాజిక భవన నిర్మాణం చేపట్టాలని నిశ్చయించామన్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు సమాయత్తం అవుతున్న తరుణంలో దాసరిపేట గ్రామానికి చెందిన సోము బాబు, బౌరుబిల్లి సన్యాశి, బౌరుబిల్లి రామునాడు, బౌరుబిల్లి అప్పలనాయుడు, పాదం సన్యాశి కలిసి దళితులను భయపెట్టి అక్కడ భవన నిర్మాణానికి గోతులు తవ్వారన్నారు. ఇదే విషయాన్ని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆరోపించారు. దాంతో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టామన్నారు. డీఆర్వోను కలిసిన వారిలో వడ్డ అప్పన్న, యాదగిరి అప్పలరాజు, శీర భాస్కరరావు, పైడిరాజు, మామిడి అప్పన్న పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజాం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్. రూపావతి, పార్వతి, భారతి, కుమారి, వనజాక్షి, జయలక్ష్మి, సునీత, లక్ష్మి, సుజాత, నిర్మల, పైడమ్మ, సునీత పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పీసా చట్టంపై ఇస్తున్న శిక్షణా తరగతులను జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా సోమవారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యుల పాత్ర, పీసా గ్రామ సభల్లో భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. పరిశీలనలో ఎంపీడీవో కె.గీతాంజలి, ఏపీఎస్ఐఆర్డీ పర్యవేక్షకుడు హనుమంతరావు ఉన్నారు.

ఆటోనగర్ అంతేనా?

(ఐదో పేజీ తరువాయి)

ఆటోనగర్‌లో కొంతవరకు రోడ్లు వేశారు. అయితే మౌలిక వసతుల కల్పనపై పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ఆ ప్రాంతం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. మరోవైపు ఎంతోమంది మోటారు కార్మికులు వేలాది రుపాయలు చెల్లిస్తూ అద్దె షాపుల్లోనే కొనసాగుతున్నారు. ఆటోనగర్ అందు బాటులోకి వస్తే పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్సు, వేంకటేశ్వర డీలక్స్ సెంటర్, గాంధీనగర్ వద్ద ఉన్న మోటర్ మెకానిక్ షాపులన్నీ ఆటోనగర్‌కు తరలించొచ్చు. దీంతో సాలూరులో కొంతవరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

దృష్టి సారించాలి..

సాలూరులో ఎన్నో కుటుంబాలకు లారీ పరిశ్రమే జీవనాధారం. అయితే ప్రభుత్వాలు మారినా ఆయా కుటుంబాలు తల రాతలు మారడం లేదు. ఇప్పటికైనా ఆటోనగర్‌పై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలి. దీనివల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది.

- ఇ.నారాయణరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు, సాలూరు

అభివృద్ధి చేస్తాం..

ఆటోనగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. దీనిపై దృష్టి సారించాం. గత ప్రభుత్వం లారీ పరిశ్రమను పట్టించుకోలేదు. రకరకాల పన్నులతో ఇబ్బందులకు గురిచేసింది.

- గుమ్మిడి సంధ్యారాణి, మంత్రి

నత్తనడకన!

(ఐదో పేజీ తరువాయి)

బాత్ రూమ్ నిర్మాణ దశలో రూ.12వేల చొప్పున లబ్ధిదారులకు అందజేస్తారు. మొత్తంగా గృహ నిర్మాణానికి రూ.2.39లక్షల లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాకు నేరుగా జమచేస్తారు.

గృహాలు మంజూరు ఇలా...

పీఎం జన్‌మన్ పథకం కింద మండలంలో 36 సచివాలయాల పరిధిలో 2,023 గృహాలు మంజూరయ్యాయి. దేవనాపురం 39, దారపాడు 86, గొయిది 76, హడ్డుబంగి 80, కడగండి 141, కిండంగి 101, కోడిశ 73, కొండాడ 92, కోతాం 153, కుడ్డపల్లి 131, మండ 91, మర్రిపాడు 109, పెదరామ 63, పొల్ల 60, సోమగండి 152, పూతికవలస 109, తాలాడ 83, టిటుకుపాయి 50, వజ్జాయిగూడ 53, కుసిమి 48, కీసరజోడు 30, పెద్దూరు 30, పుబ్బాడ 23, సామరెల్లి 30, శంభాం 24 తదితర పంచాయతీలకు గృహాలు మంజూరయ్యాయి. ఒక్కో గృహ నిర్మాణానికి లబ్ధిదారుడికి రూ.2.39లక్షలు చెల్లించనున్నారు. ఇంటి నిర్మాణ సమయంలో విడతల వారీగా బిల్లుల రూపంలో లబ్ధిదారులకు ఆ మొత్తం చెల్లిస్తారు.

అందుకే జాప్యం..

ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరు జాప్యం కారణంగానే గిరిజనుల గృహ నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయి. కాగా ఇంత వరకు నిర్మాణాలు చేపడుతున్న పీవీటీజీ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నాం. దీనిపై వారికి అవగాహన కల్పిస్తున్నాం.

- కె.గీతాంజలి, ఎంపీడీవో, సీతంపేట

సహారా బాధితులను ఆదుకోవాలి

సాలూరు(పాచిపెంట), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సహారా బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు కోరాడ ఈశ్వరరావు కోరారు. సోమవారం పాచిపెంటలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా బ్రాంచ్ పరిధిలో బాధితులకు సుమారు రూ.100 కోట్లు రావాల్సి ఉందన్నారు. ఈ విషయమై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సహారా బాధితులు ఎం.నాగేశ్వరరావు, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

గనుల శాఖాధికారుల తనిఖీ

వీరఘట్టం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యు.వెంకమ్మపేట సమీపంలో గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం తెలుసుకున్న గనుల శాఖ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో గ్రావెల్ తవ్వుతున్న ప్రొక్లయినర్, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రావెల్ మాఫియాపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

వన్‌స్టాప్ సెంటర్ పరిశీలన

పార్వతీపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ద్వారా జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న వన్‌స్టాప్ సెంటర్‌ను పోలీసు అధికారులు సోమవారం సందర్శించారు. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళల భద్రత కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సెంటర్ అడ్మినిస్ట్రేటర్ జి.శాంతి కుమారి పోలీస్ అధికారులకు తెలపారు. బాల్యవివాహాలు నివారించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆమె వివరించారు. పోలీస్ శాఖ ద్వారా తమ వంతు సహకారం అందిస్తామని ఎస్‌ఐలు గోవిందరావు, సంతోష్‌కుమారి చెప్పారు.

బీజేపీలో చేరిక

గరుగుబిల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దుమ్మంగి సర్పంచ్ కడ్రక అప్పలస్వామితో పాటు పలువురు వైసీపీని వీడి బీజేపీలో చేరారు. సోమవారం చిలకాం గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు ఆ పార్టీలో చేరారు. బీజేపీ మండల అధ్యక్షుడు దివాకర్, తాడికొండ ఎంపీటీసీ సభ్యుడు నిమ్మక భాస్కరరావు ఉన్నారు.

రాయగడలో రైల్వే జీఎం పర్యటన



రైల్వే స్టేషన్‌లో పరిశీలిస్తున్న జీఎం

ఒడిశా

రాయగడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫంక్వాల్ సోమవారం రాయగడ డివిజన్ పర్యటనకు వచ్చారు. ప్రత్యేక రైలులో వచ్చిన ఆయనకు రాయగడ అధికారులు స్వాగతం పలికారు. ఆయన రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్‌తో కలిసి పలు పనులను, స్టేషన్ పరిసరాలు, స్టాల్స్, ప్రయాణికుల విశ్రాంతి గదులు, పలు కార్యాలయాలను పరిశీలించారు. అనంతరం ప్రత్యేక రైలులో రాయగడ -విజయనగరం మధ్యనున్న పార్వతీపురం, బొబ్బిలి వంటి స్టేషన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ట్రాక్‌లు, సిగ్నల్స్ గ్యాంగ్‌మేన్‌ల పనితీరు, సేఫ్టీ చెకింగ్, విద్యుత్, స్టేషన్లలో మౌలిక సదుపాయాలు వంటి వాటిని పరిశీలించారు. పనుల తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట విశాఖపట్నం డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, రాయగడ డీఆర్ఎం, అమితాబ్ సింఘాల్ ఉన్నారు.

ఖోఖో క్రీడాకారిణికి ఘన స్వాగతం



ఊరేగింపుగా వెళ్తున్న మగాయి

రాయగడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా ఖోఖో పోటీల్లో భారత్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ జట్టులో తనదైన ప్రతిభ చూపిన ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా కాశీపూర్‌కు చెందిన మగాయి మాఝికి రాయగడ రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. క్రీడలు ముగించుకుని సోమవారం రాయగడకు చేరుకున్న ఆమెకు క్రీడాకారులు, బంధువులు, మిత్రులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని ఆదివాసీ నృత్య సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక మాట్లాడుతూ.. మగాయి తన ప్రతిభతో తమ రాష్ట్రానికి, జిల్లాకు మంచిపేరు తీసుకొచ్చిందన్నారు. అనంతరం మగాయిని ప్రత్యేక వాహనంపై పట్టణంలో ఊరేగించారు. తన స్వగ్రామం కాశీపూర్‌లో గ్రామస్థులు బాణసంచాతో స్వాగతం పలికారు.

ఇక్కడి నుంచి తరలిస్తే రోడ్డున పడతాం

- రైల్వే స్టేషన్ రోడ్డులో కుటుంబాలను ఖాళీ చేసేందుకు అధికారుల ప్రయత్నం
- యంత్రాల ముందు బైఠాయించిన బాధితులు

సాలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తాము ఇక్కడ 25 ఏళ్లగా నివాసం ఉంటున్నామని, ఇక్కడ నుంచి తరలిస్తే రోడ్డున పడతామని రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసం ఉంటున్న కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. కోర్టు ఆదేశాలతో స్థానిక మున్సిపల్ అధికారులు సోమవారం ఇక్కడి నివాసితులను ఖాళీ చేసే ప్రయత్నం చేశారు. వీరిని టీడీపీ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆ కుటుంబాలు అడ్డుకున్నాయి. పట్టణంలోని సర్వే నెం.138, 139లలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో 31 కుటుంబాలకు చెందిన ప్రజలు సుమారు 25 ఏళ్లగా నివాసం ఉంటున్నారు. అయితే ఆ నివాసాల వెనుక తాను సాగు చేస్తున్న భూమి ఉందని, ఆ స్థలంలోకి వెళ్లేందుకు తనకు దారి చూపించాలని భూ అప్పారావు అనే వ్యక్తి గతంలో కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు రైల్వేస్టేషన్ రోడ్డు మున్సిపల్ స్థలంలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించి, భూ యజమానికి దారి చూపించాలని కోర్టు అధికారులను ఆదేశించింది. దీంతో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, ప్లానింగ్ అధికారిణి ఝాన్సీ ఆదేశాల మేరకు అక్కడ నివాసం ఉంటున్న 31 కుటుంబాలకు నోటీసులు ఇచ్చారు. అయితే వారు అక్కడ నుంచి ఖాళీ చేయకపోవటంతో మున్సిపల్ అధికారులు.. పట్టణ సీఐ అప్పలనాయుడు, రూరల్ సీఐ రామకృష్ణతో పాటు పోలీసులను వెంట బెట్టుకుని అక్కడకు వెళ్లారు. ఇళ్లను ఖాళీ చేయించేందుకు ప్రొక్లయినర్‌ను తీసుకొచ్చారు. దీంతో అక్కడ ఉన్న కుటుంబాలతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు ఎన్‌వై నాయుడు ఆధ్వర్యంలో తొలగింపును అడ్డుకున్నారు. ఈసందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు మాట్లాడుతూ సుమారు 25 ఏళ్లగా నివాసం ఉంటున్న పేదలను ఒక్క సారిగా అక్కడ నుంచి తరలించడం సరికాదన్నారు. సంబంధిత రైతు మున్సిపాల్టీ స్థలాన్ని ఆక్రమించి సాగు చేస్తున్నారని అన్నారు. ముందుగా సాగు చేస్తున్న భూమిని సర్వే చేయాలని ఆయన అధికారులను కోరారు. ఎన్‌వై.నాయుడు మాట్లాడుతూ వారు ఉన్న చోటనే భూ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. భూ యాజమాని స్థలంలోనికి వాహనాలు వెళ్లే విధంగా యంత్రంతో చదును చేయించి, అక్కడ నుంచి అధికారులు వెనుతిరిగారు.



రైల్వే రోడ్డులో బైఠాయించిన బాధితులు

తాగునీటి సౌకర్యం కల్పించాలి



ఎమ్మెల్యే జగదీశ్వరికి సమస్యలను వివరిస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమకు తాగునీటి సౌకర్యం కల్పించాలని దుమ్మంగి పంచాయతీ కొరడగూడ గ్రామస్థులు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. ఈ మేరకు వారు సోమవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆమెను కలిసి, వినతిపత్రం అందించారు. గ్రామంలో సుమారుగా 25 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఒత్తిడి లేకుండా చదవండి

వీరఘట్టం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి లేకుండా చదవాలని ఎంఈవో ఆనందరావు పదో తరగతి విద్యార్థులకు సూచించారు. ఆయన సోమవారం సంతనర్సిపురం గోర జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థినులకు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న హిమోగ్లోబిన్ పరీక్షలను పరిశీలించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

సారా స్వాధీనం

కురుపాం, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం మండలంలో వివిధ గ్రామాలలో దాడులు నిర్వహించి అక్రమంగా అమ్ముతున్న 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడి, పులిగూడ గ్రామాలలో జరిపిన దాడుల్లో బి.పండు నుంచి 80 లీటర్లు, వి.కిరణ్‌కుమార్ నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ జె.రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

సాలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కొదమ పంచాయతీ కొంజిపాక గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. ఈ మేరకు వారు మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సోమవారం సాలూరులోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి, వినతిపత్రం సమర్పించారు. దుగ్గేరు సెంటర్ నుంచి కొంజిపాక గ్రామం వరకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అలాగే గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారని తెలిపారు.

కలిసికట్టుగా పని చేయాలి

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పాలకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు చేసిన అన్యాయాన్ని బలంగా ప్రచారం చేయాలన్నారు. ఆ ఎన్నికల్లో కుటుంబ సాధికార సారథులు కీలక భూమి పోషించాలన్నారు. ఈ సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జీసీసీ చైర్మన్ కిడారి శ్రవణ్, కూటమి నాయకులు గంటా సంతోష్, కోట సంగంనాయుడు, చేబోదుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైల్వే జీఎం దృష్టికి సమస్యలు



రైల్వే జీఎంకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే జీఎం పరమేశ్వర పంక్వార్ సోమవారం బెలగాం రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ మేరకు అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. ఈ ప్రాంత రైల్వే సమస్యలను ఆయనకు వివరించారు. తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రతిరోజూ పార్వతీపురం నుంచి రైలు వేయాలన్నారు. స్థానిక రైల్వేగేటు వద్ద సుమారు 18 గ్రామాల ప్రజలు గేటు వేసేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్ఫ్ ట్రైన్ టైమింగ్స్ మార్చాలని కోరారు. బెలగాం రైల్వేస్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా మార్చాలని ఎమ్మెల్యే కోరారు. నర్సిపురం రైల్వే హాల్ట్ వద్ద రైళ్లు నిలబడే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై జీఎం స్పందించి.. పార్వతీపురం రైల్వేస్టేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. కూటమి నాయకులు ఉన్నారు. ● పార్వతీపురం వచ్చిన రైల్వే జీఎం పరమేశ్వ పంక్వార్‌ను సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కలిసి, పలు రైల్వే సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు. రిజర్వేషన్ల బుకింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. విశాఖపట్నం, రాయగడ మధ్య రాకపోకలు సాగించే పలు రైళ్లు గుమడ రైల్వేస్టేషన్‌లో ఒకటో ఫ్లాట్‌ఫారానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ట్రెంచ్‌లను ఏర్పాటు చేయిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి పత్రికలో సోమవారం 'తవ్వేస్తున్నారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ పి.బాల, ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, వీఆర్వో టి.రవికుమార్, సచివాలయ కార్యదర్శి ఎన్.రవికుమార్‌లు అక్రమ ఇసుక తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించారు. పరిసర గ్రామాలకు చెందిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. నాగావళి నది నుంచి ఇసుక రవాణా జరగకుండా ఉండేలా జేసీబీల సహాయంతో ప్రత్యేక ట్రెంచీలను ఏర్పాటు చేశారు. అనుమతులు లేని ప్రాంతా ల నుంచి రవాణా జరగకుండా ఉండేలా ఆయా ప్రాంతాల వీఆర్వోలకు ప్రత్యేక సూచనలు చేశారు. తోటపల్లి ప్రాజెక్టు ప్రాంతంలో ఇసుక రవాణా జరగ కుండా ఉండేలా సిబ్బందిని పరిశీలనకు ఏర్పాటు చేశా మని చెప్పారు. అనధికారికంగా ఇసుకను తరలిస్తే జరిమానాతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

స్వచ్ఛ సుందర పార్వతీపురం సాధిద్దాం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉండే వనరులతో స్వచ్ఛతకు పెద్దపీట వేసి స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వచ్ఛ సుందర పార్వతీపురంపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురం అందరి బాధ్యత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వంద గృహాల నుంచి చెత్తను సేకరించేందుకు మూడు చక్రాల వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. మార్చి 1వ తేదీ నుంచి మాస్టర్ ట్రైనీలతో శిక్షణ ఇప్పించి మాస్టర్ ట్రైనీలను తయారు చేస్తామని, ఆ విధంగా వారు మిగిలిన సిబ్బందికి శిక్షణ ఇస్తారని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆలయంలో హుండీ చోరీ

వీరఘట్టం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నీలానగరం గ్రామంలో ఉన్న అంజనేయస్వామి ఆలయంలో గల హుండీ ఆదివారం రాత్రి చోరీకి గురయ్యింది. సోమవారం ఉదయం పూజలు నిమిత్తం దేవాలయానికి వెళ్లేసరికి హుండీ లేకపోవడంతో పూజారి హజ్రాపు కామేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కళానిధి తెలిపారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాలూరు(మక్కువ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎండీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని సీఐటీయూ మండల అధ్య క్షురాలు దాలమ్మ అన్నారు. ఈ మేరకు సోమవారం మక్కువలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండీఎం కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్చి 10న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని తెలిపారు.

కలాసీ సంఘం నూతన కార్యవర్గం

సాలూరు(మక్కువ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలాసీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికను సోమవారం నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గోపాలం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక కలాసీ సంఘం అధ్యక్షుడిగా బూరాడ గౌరు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.అప్పారావు, కోశాధికారిగా బి.అప్పారావు ఎన్నికయ్యారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

పాలకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వద్దని నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు శానిటేషన్ సిబ్బందికి హెచ్చరించారు. పాలకొండలోని పలు వార్డుల్లో ఆయన సోమవారం ఉదయం పర్యటించి, పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. దేవరపేటలో నిర్వహిస్తున్న పనులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తా చెదారం లేకుండా చూడాలని ఆదేశించారు.

జీడి మొక్కల తొలగింపు ఆపండి



బెలగాం: నిరసన చేస్తున్న గిరిజనులు

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం సంగంవలస పంచాయతీ సీతంపేట గిరిజనుల సాగు భూముల్లో వేసుకున్న జీడి మొక్కల తొలగింపును వెంటనే ఆపాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అటవీ శాఖాధికారులను కోరారు. సోమవారం సీతంపేట గిరిజనులు ఎమ్మెల్యేను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. 25 ఏళ్లుగా తమ జీవనోపాధి అయిన జీడి మొక్కలను అటవీ శాఖాధికారులు ఆకస్మికంగా వచ్చి యంత్రాలతో తొలగిస్తున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే అటవీ శాఖాధికారులకు ఫోన్ చేసి, తాను క్షేత్రస్థాయిలో పర్యటించి విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తానని, అంతవరకు జీడి మొక్కల తొలగింపులను ఆపాలని కోరారు. అందుకు అటవీ శాఖాధికారులు సమ్మతించారు.

కలెక్టరేట్ వద్ద నిరసన

బెలగాం: పార్వతీపురం మండలం సంగంవలస పంచాయతీకి చెందిన సీతంపేట గ్రామంలో గిరిజనుల సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు చేపట్టిన జీడి మొక్కల తొలగింపు ఆపాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

సమ్మె హామీలు అమలు చేయాలి

- అంగన్‌వాడీల ఆందోళన



పాలకొండ: అధికారులకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

బలిజిపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సమ్మె హామీలు అమలు చేయాలని కోరుతూ బలిజిపేటలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా చేపట్టారు. మినిట్స్ కాపీలకు జీవోలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసీడీఎస్ పీవో సురేఖకు వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ప్రాజెక్టు నాయకులు కె.దాలమ్మ తదితరులు పాల్గొన్నారు. ● పాలకొండ: పాలకొండలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.హిమ ప్రభ, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు బి.అమరవేణి, జి.జెస్సీబాయి తదితరులు పాల్గొన్నారు. ● పార్వతీపురం రూరల్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘ ప్రతినిధులు ఎం.గౌరీ, కె.రాజేశ్వరి, వి.ఇందిర ఆధ్వర్యంలో పార్వతీపురం సీడీపీవో శ్రీనివారావుకు వినతిపత్రం సమర్పించారు.

పీసా చట్టంపై అవగాహన అవసరం

కురుపాం, ఫిబ్రవరి 17: పీసా చట్టంపై సర్పంచులు, కార్యదర్శులు, పీసా కమిటీ సభ్యులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద పీసా చట్టంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట నుంచి ఫెసిలిటేట్ మెంబర్ పి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పీసా చట్టంపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ పీసా 2011చట్టం ప్రకారం 7 రకాల పీసా విధులు, బాధ్యతలు ఉన్నాయని, వాటిని కమిటీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పక్కాగా అమలయ్యేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆర్.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.